ఢిల్లీకి సన్‌స్ట్రోక్

- ఉత్తరాదిని వణికిస్తున్న అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పులు
- రాజధాని ఢిల్లీలో 24 గంటల్లో 22 మంది మృతి
- నిఘంబోధ్ శ్మశానవాటికలో కొవిడ్ తర్వాత ఇప్పుడే అత్యధిక సంఖ్యలో అంత్యక్రియలు
- ఈ వేసవిలో దేశవ్యాప్తంగా 114 మరణాలు

న్యూఢిల్లీ, జూన్ 20: నైరుతి రుతుపవనాల రాకతో దక్షిణాదిలో వాతావరణం కొంత చల్లబడినా.. ఉత్తరాదిలో అధిక ఎండలు, వడగాల్పులు తారెత్తిస్తున్నాయి. ప్రధానంగా దేశ రాజధాని ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో వేడి గాలులు మరణ మృదంగం మోగిస్తున్నాయి. ఢిల్లీలో గత 24 గంటల వ్యవధిలో అధిక ఉష్ణోగ్రతలు, వడదెబ్బ సంబంధిత అనారోగ్యంతో 22 మంది మరణించారని అధికారులు గురువారం వెల్లడించారు. మరోవైపు దేశవ్యాప్తంగా మార్చి 1 నుంచి జూన్ 18 మధ్యలో వడగాల్పుల కారణంగా మొత్తం 114 మంది మరణించారని, 40,984 మంది వడదెబ్బకు గురయ్యారని కేంద్ర ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ఉత్తరప్రదేశ్‌లో అధికంగా 37 మంది మరణించారని, తర్వాతి స్థానాల్లో బీహార్, రాజస్థాన్, ఒడిశా ఉన్నాయని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ డాటా పేర్కొన్నది.

నిఘంబోధ్ ఘాట్ కిటకిట

వడగాల్పుల సంబంధిత మరణాలతో ఢిల్లీలోని ప్రధాన శ్మశానవాటిక నిఘంబోధ్ ఘాట్‌లో సామూహిక అంత్యక్రియలు పెరిగాయి. కొవిడ్ తర్వాత ఇక్కడ సామూహిక అంత్యక్రియలు పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. అయితే ఆ మరణాలన్నింటికీ వడగాల్పులే కారణమా? అనేదాన్ని మాత్రం అధికారులు నిర్ధారించలేదు. బుధవారం నిఘంబోధ్ ఘాట్‌లో 142 మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఇది రోజువారీ జరిగే 50-60 మృతదేహాల కంటే 136 శాతం అధికమని శ్మశానవాటిక నిర్వాహకులు చెబుతున్నారు. కొవిడ్ సమయంలో ఒక్కరోజులో నిఘంబోధ్ 253 శవాలను ఖననం చేయడం జరిగిందని, ఆ తర్వాత ఒక్కరోజులే ఇదే అధికమని అధికారులు చెబుతున్నారు. గురువారం కూడా 97 మృతదేహాలకు అంత్యక్రియలు చేశారు.

హజ్ యాత్రలో వెయ్యి మందికి పైగా మృతి

మరోవైపు అధిక ఉష్ణోగ్రతలు సౌదీ అరేబియాను వణికిస్తున్నాయి. వడగాల్పుల కారణంగా ఈ ఏడాది హజ్ యాత్రలో ఇప్పటి వరకు వెయ్యి మందికి పైగా యాత్రికులు మరణించారని మీడియా నివేదికలు చెబుతున్నాయి. మక్కాలో 49 డిగ్రీల కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో వేలాది మంది వడదెబ్బ బారిన పడుతున్నారు. మరణించిన వారిలో ఈజిప్టుకు చెందిన 658 మంది, 90 మంది భారతీయులు ఉన్నట్టు తెలుస్తున్నది. మృతుల్లో అన్‌రిజిస్టర్డ్ యాత్రికులు సగం కంటే ఎక్కువగా ఉన్నారు. కొంతమంది మిస్సింగ్ అయినట్టు కూడా వార్తలు వస్తున్నాయి. తమ వాళ్ల ఆచూకీ కోసం బంధువులు సోషల్ మీడియాల్లో పోస్టులు, ఫొటోలు పెడుతున్నారు.

దక్షిణ చైనా సముద్రంలో గల్వాన్ తరహా ఘటన

ఫిలిప్పీన్స్ నేవీ పడవలపై కత్తులు, గొడ్డళ్లతో విరుచుకుపడ్డ చైనా

న్యూఢిల్లీ, జూన్ 20: దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ దేశం దాష్టీకాన్ని ప్రదర్శించింది. 2020లో భారత సైనికులపై చైనా జరిపిన గల్వాన్ తరహా అమానుష దాడిని గుర్తు చేసేలా ఫిలిప్పీన్స్ నేవీకి చెందిన రెండు బోట్లపై చైనా సైనికులు కత్తులు, గొడ్డళ్లు, సుత్తులతో దాడి చేసి బోట్లను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో పలువురు ఫిలిప్పీన్స్ నావికులు గాయపడ్డారు. బోటుల్లోకి చొరబడ్డ చైనా సైనికులు వాటిని ధ్వంసం చేసి, ఎనిమిది ఎం4 రైఫిళ్లు, నావిగేషన్ సామగ్రి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు అసోసియేటెడ్ ప్రెస్ వెల్లడించింది. కత్తులు, గొడ్డళ్లు, ఈటెలతో తమపై చైనా మిలటరీ సైనికులు దాడి చేసి తమ వద్ద ఉన్న ఆయుధాలను అపహరించుకుపోయారని ఫిలిప్పీన్స్ మిలటరీ తెలిపింది.

నేటి నుంచి ఢిల్లీ మంత్రి ఆతిశీ నిరాహార దీక్ష

హర్యానా నుంచి నీటి విడుదలకు డిమాండ్

న్యూఢిల్లీ: ఢిల్లీ నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆప్ నేత, ఢిల్లీ మంత్రి ఆతిశీ శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నారు. రోజూ హర్యానా నుంచి ఢిల్లీకి 100 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేయాలని తాను నిరాహార దీక్ష చేపడుతున్నట్టు ఆమె మీడియాకు తెలిపారు. శుక్రవారం రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మునికి నివాళి అర్పించిన తర్వాత దక్షిణ ఢిల్లీలోని భోగల్‌లో దీక్షకు కూర్చుంటానని చెప్పారు. హర్యానాలోని బీజేపీ సర్కారు ఢిల్లీకి నీటిని విడుదల చేయడం లేదన్నారు.

పాలల్లో సర్ఫ్.. పల్లిపట్టీల్లో గిన్నెలు కడిగే లిక్విడ్

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఆహార కల్తీ ఉదంతాలు

న్యూఢిల్లీ, జూన్ 20: మన దేశంలో ఆహార కల్తీ తీవ్రత ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదంతాలు తాజాగా 'ఎక్స్'లో వెలుగులోకి వచ్చాయి. రామ్‌ప్రసాద్ అనే వ్యాపారవేత్త 2005లో తనకు ఎదురైన అనుభవంపై చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. తాను కొత్తగా సర్ఫ్‌ను తయారుచేసి మార్కెట్‌లోకి విడుదల చేసినప్పుడు ఒక సేల్స్ ఎగ్జిక్యూటీవ్ సర్ఫ్‌లో పరిమళాన్ని తగ్గించాలని చెప్పాడని గుర్తుచేసుకున్నారు. ఎందుకని తాను అడగగా పాలల్లో కలిపేందుకు తక్కువ పరిమళం ఉండే సర్ఫ్‌నే కొంటారని చెప్పడంతో ఆశ్చర్యపోయానని చెప్పుకొచ్చారు. పాలు తెల్లగా కనిపించేందుకు, నురుగు వచ్చేందుకు సర్ఫ్ వేసి కలుపుతారని చెప్పాడని, అప్పటి నుంచి ఆ ప్రాంతంలో దొరికే లస్సీ, పెరుగును తినడం మానేశానని చెప్పారు. సర్ఫ్‌ను మార్చేది లేదని చెప్పినట్టు గుర్తు చేసుకున్నారు. ఈ పోస్ట్‌కు స్పందనగా మరో వ్యక్తి తన స్నేహితుడి పల్లిపట్టీ కంపెనీలో అనుభవాన్ని చెప్పారు. ఒకరోజు పల్లిపట్టీలు తయారుచేయడానికి వచ్చిన కొత్త వ్యక్తి రోజుకంటే ఎక్కువ తయారుచేశాడని, పైగా కరకరలాడేలా చేశాడని తెలిపారు. ఇందులో మర్మమేంటో అతడిని అడగగా గిన్నెలు కడిగేందుకు వినియోగించే లిక్విడ్‌ను పోసినట్టు చెప్పాడని గుర్తు చేసుకున్నారు. దీంతో తయారుచేసిన పల్లిపట్టీలను చెత్తకుప్పలో వేసి, ఆ వ్యక్తిని పనిలో నుంచి తొలగించినట్టు చెప్పారు.

'వందేభారత్' భోజనంలో బొద్దింక

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో భోజనం నాణ్యత మరోమారు చర్చనీయాంశమైంది. ఈ నెల 18న భోపాల్ నుంచి ఆగ్రా వెళ్తున్న జంటకు రైలులో సరఫరా చేసిన భోజనంలో బొద్దింక దర్శనమిచ్చింది. ఈ ఘటనపై వారి మేనల్లుడు సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్' ద్వారా రైల్వేకు ఫిర్యాదు చేశాడు. భోజనం సరఫరా చేసిన వెండర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ ఫిర్యాదుపై రైల్వే గురువారం స్పందించింది. రైలులో ఆ జంటకు ఎదురైన అనుభవానికి క్షమాపణలు తెలిపింది. భోజనం సరఫరా చేసిన వెండర్‌పై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా కూడా విధించినట్టు బదులిచ్చింది.

ప్రధాని కాన్వాయ్‌పై చెప్పు!

వారణాసి: వారణాసిలో ప్రధాని మోదీ కాన్వాయ్‌పై చెప్పు విసిరిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారణాసి నుంచి ప్రధాని వరుసగా మూడోసారి గెలుపొందిన సంగతి తెలిసిందే. మూడోసారి గెలుపు అనంతరం తొలిసారి ఆయన ఈ నెల 19న తన నియోజకవర్గ పర్యటనకు వచ్చారు. కాన్వాయ్ వారణాసి వీధుల్లో వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఎవరో చెప్పు విసరడం, దానిని భద్రతా సిబ్బంది తొలగిస్తున్న వీడియో వైరల్ అయ్యింది. గత రెండుసార్ల కన్నా ఈసారి మోదీ అతి తక్కువ మెజారిటీతో వారణాసిలో గెలుపొందారు. మొదటిసారి 2014లో ఆయన 3,71,784 ఓట్లతో, రెండోసారి 2019లో 4,79,505 ఓట్లతో గెలుపొందగా, ఈసారి కేవలం 1,52,513 ఓట్ల మెజారిటీ మాత్రమే వచ్చింది.

లైక్‌లు, వ్యూస్ కోసం ప్రాణాలు పణంగా..

ఇన్‌స్టాలో వ్యూస్, లైక్స్ కోసం కొందరు యువత ప్రాణాలకు తెగించి రీల్స్ చేస్తున్నారు. పుణెకు చెందిన ఇద్దరు టీనేజర్లు తమ ప్రాణాలను పణంగా పెట్టి ఎత్తయిన భవనం పైనుంచి వేలాడుతూ చేసిన ఫీట్ ఇప్పుడు ఎక్స్‌లో వైరల్‌గా మారింది. ఒక ఎత్తయిన భవనం పైభాగం నుంచి ఒక యువతి గాలిలో వేలాడుతుండగా, ఆమె చేతిని యువకుడు పట్టుకుని ఆపాడు. అక్కడే ఉన్న మరో యువకుడు దీనిని కెమెరాలో బంధిస్తున్నాడు. ఈ దృశ్యం చూసే వారికి భీతి పుట్టిస్తున్నది. అతని చేయి జారి ఆమె కిందపడితే ప్రాణాలు గల్లంతే. ఇలాంటి ఫీట్లు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని పలువురు నెటిజన్లు కామెంట్ చేశారు.

మత్తిచ్చి.. అమ్మాయిగా మార్చి

- ఫ్రెండ్‌ని స్త్రీగా మార్చిన యువకుడు!
- బాధితుడికి తెలియకుండానే లింగమార్పిడి శస్త్రచికిత్స
- ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో ఘటన
- ఆస్తికోసం దారుణం

లక్నో: స్నేహితుడి ఆస్తి కొట్టేయాలని భావించిన యువకుడు సినీ రచయితల ఊహకు సైతం అందని ప్లాన్ వేశాడు. వైద్యులతో కలిసి కుట్రపన్ని లింగమార్పిడి ఆపరేషన్ చేయించాడు. ఆపై పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. యువకుడి తండ్రిని చంపేస్తానని బెదిరించి అతడి వాటా ఆస్తిని రాయించుకున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనమైంది. పోలీసుల కథనం ప్రకారం.. సంజక్ గ్రామానికి చెందిన ముజాహిద్ (20), ఓంప్రకాశ్ స్నేహితులు. రెండేండ్లుగా సన్నిహితంగా మెలుగుతున్నారు. అనారోగ్యం పేరుతో ఈనెల 3న ముజాహిద్‌ను ఓంప్రకాశ్ దవాఖానకు తీసుకెళ్లాడు. అక్కడ ముజాహిద్‌కు మత్తుమందు (అనెస్థీషియా) ఇచ్చిన వైద్యులు లింగమార్పిడి ఆపరేషన్ చేసి అమ్మాయిగా మార్చేశారు. స్పృహ వచ్చాక తాను అమ్మాయిగా మారినట్టు చెప్పడంతో నిర్ఘాంతపోయానని ఓంప్రకాశ్ గుర్తు చేసుకున్నాడు. మనం పెళ్లి చేసుకుందామని, అందుకోసం లాయర్‌ను, కోర్టును కూడా సిద్ధం చేశానని ముజాహిద్‌తో ఓంప్రకాశ్ చెప్పుకొచ్చాడు. ''ఇప్పుడు నీ తండ్రిని కాల్చి చంపి నీ వాటాగా రావాల్సిన భూమిని తీసుకుని నా పేరుపై రాయించుకుంటాను. ఆ తర్వాత దానిని అమ్మేసి లక్నో వెళ్లిపోతాను'' అని ఓంప్రకాశ్ తనను బెదిరించినట్టు ముజాహిద్ ఆరోపించాడు. ఘటన వెలుగులోకి రావడంతో మాజీ నేత శ్యాంపాల్ నేతృత్వంలోని భారతీయ కిసాన్ యూనియన్ నేతలు మెడికల్ కాలేజీ ఎదుట ఆందోళనకు దిగారు. ఓం ప్రకాశ్‌తోపాటు అతడికి సహకరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనక మానవ అవయవాల అక్రమ రవాణా ముఠా ఉండే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

నడకతో వెన్నునొప్పి మటుమాయం!

న్యూఢిల్లీ, జూన్ 20: ప్రతి రోజూ కొంత సేపు చేసే వాకింగ్‌తో వెన్నునొప్పి నుంచి ఉపశమనం లభిస్తుందని తాజా అధ్యయనం పేర్కొన్నది. ఆస్ట్రేలియాలోని మక్వారీ యూనివర్సిటీ పరిశోధకులు వెన్నునొప్పితో బాధపడుతున్న రోగులను మూడు గ్రూపులుగా విడగొట్టారు. వాకింగ్ చేసే వాళ్లు, ఫిజియోథెరపీ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నవాళ్లు, ఈ రెండింటికీ దూరంగా ఉన్న వాళ్లుగా గ్రూపులను ఏర్పాటుచేశారు. ఇందులో సాధారణ నడక గ్రూప్‌లోని 700 మంది రోగులు వెన్నునొప్పి సమస్య నుంచి బయటపడ్డట్టు పరిశోధకులు గుర్తించారు. 'సాధారణ నడక.. అన్ని వయసుల వారికి ఉపయోగకరం. పైగా.. ఖర్చులేనిది. అందరూ పాటించదగినది. ఫిజియోథెరపీ అలా కాదు. కొంతమంది నిపుణుల ఆధ్వర్యంలో చేపట్టాలి. ఖరీదైన పరికరాలు అవసరం. చాలామంది వెన్నునొప్పి రోగులకు ఇది అందుబాటులో ఉండదు' అని పరిశోధకులు తెలిపారు. డబ్ల్యూహెచ్‌వో ప్రకారం, ప్రపంచంలో 62 కోట్లమంది వెన్నునొప్పితో బాధపడుతున్నారు.

త్వరలో రామగుండం 'బీ థర్మల్' మూసివేత

- రూ.14.8 కోట్లతో నిర్మాణం.. 1965లో తొలివెలుగులు
- తొమ్మిదేండ్ల కిందటే ముగిసిన ప్లాంటు జీవిత కాలం
- ప్లాంటులో 15 రోజులుగా నిలిచిన విద్యుత్తు ఉత్పత్తి

పెద్దపల్లి, జూన్ 20 (నమస్తే తెలంగాణ): దశాబ్దాల చరిత్ర కలిగి ఉమ్మడి రాష్ట్రంలోనే తొలి వెలుగులు పంచిన 62.5 మెగావాట్ల పెద్దపల్లి జిల్లా రామగుండం బీ థర్మల్ విద్యుత్తు కేంద్రం మూతపడనున్నది. 1965లో రూ. 14.8 కోట్లతో యునైటెడ్ స్టేట్స్ ఏజెన్సీ ఆర్థిక సాయంతో 62.5 మెగావాట్ల విద్యుత్తు సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. బీ-థర్మల్ ప్లాంట్‌ను నెలకొల్పిన 13 ఏండ్ల తర్వాత దీని సరిహద్దును ఆనుకొనే 1978లో కేంద్ర ప్రభుత్వం ఎన్టీపీసీకి పునాదిరాయి వేసింది. 1983లో కేవలం 200 మెగావాట్ల సామర్థ్యంతో ఉత్పత్తి ప్రారంభించిన కార్పొరేషన్.. దశలవారీ విస్తరణతో ప్రస్తుతం 2600 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి చేరుకుని దక్షిణ భారత దేశం మొత్తానికి వెలుగులు పంచుతున్నది. అయితే.. బీ థర్మల్ ప్రాజెక్టు జీవిత కాలం 50 ఏండ్లు. ప్లాంట్ ఏర్పాటు చేసి 59 ఏండ్లు కావడంతో తరచూ సమస్యలు వస్తున్నాయి. మరమ్మతులకు, రిపేర్లకు విద్యుత్తు సౌధ నుంచి అనుమతులు రాకపోవడంతో పునరుద్ధరణ చేపట్టలేదు. ఈ ప్రాజెక్టులో మొత్తంగా 803 మంది అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ప్లాంట్ మూతపడనున్న నేపథ్యంలో జెన్‌కో సీఎండీ రిజ్వి ఈ నెల 13న 38 మంది ఇంజినీర్లు, ఐదుగురు సబ్ ఇంజినీర్లు, సీనియర్ కెమిస్ట్, నలుగురు కెమిస్ట్‌లను యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ప్రభుత్వంపై వ్యతిరేకత రావడంతో డిప్యూటేషన్ ఉత్తర్వులను రద్దు చేశారు. రాష్ట్రంలోని వివిధ పవర్ ప్లాంట్లలో పనిచేసేందుకు వారి ఇష్టం మేరకు వెళ్లాలనుకునే ఉద్యోగులకు మాత్రం అవకాశం ఇస్తూ మరో ఉత్తర్వును జారీ చేశారు.

ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించండి: జాక్టో

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): విద్యాశాఖలో 900కి పైగా ఖాళీగా ఉన్న పోస్టుల్లో అర్హతలు ఉన్న ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల జాక్టో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కోరారు. ఆ తర్వాతే పండిట్లు, పీఈటీలకు అవకాశం కల్పించాలని విన్నవించారు. గురువారం సచివాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించినట్టు జాక్టో నాయకులు సదానందం గౌడ్, కృష్ణుడు, రాధాకృష్ణ తెలిపారు.

పెండింగ్ డీఏలను విడుదల చేయాలి: టీఎన్జీవోస్

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): పెండింగ్ డీఏలను విడుదల చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కోదండరాంను టీఎన్జీవోస్ కోరారు. నేడు జరిగే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు డీఏ బకాయిలు చెల్లించే నిర్ణయం తీసుకోవాలని టీఎన్జీవో ప్రతినిధులు వారిని కలిసి తీర్మాన ప్రతిని వారికి అందజేశారు. తమ విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) పేర్కొన్నారు.

'జీతాలు వెనక్కి తీసుకునే కాలేజీలపై చర్యలు తీసుకోవాలి'

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని సాంకేతిక కళాశాలల్లో, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో వేతనాలు వేసి తిరిగి తీసుకుంటున్నారని, అలాంటి వాటిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌టీసీఈఏ అధ్యక్షుడు అయినేని సంతోష్‌కుమార్ ఉన్నత విద్యాశాఖకు విజ్ఞప్తి చేశారు. లక్షల రూపాయలు ఖాతాలో జమ చేసి తిరిగి తీసుకుంటున్నారని వాపోయారు. ఆ కాలేజీలకు జేఎన్టీయూహెచ్‌ఏ అఫిలియేషన్ ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. వీటిపై చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖను కోరారు.

రాణా పక్కనే నగల షాపులో చోరీ

- పట్టపగలే బురఖాలో నగల దుకాణంలోకి
- షాపు యాజమాని ఛాతిపైన కత్తితో దాడి
- ఓనర్ సమయస్ఫూర్తితో దొంగల పరారీ
- మేడ్చల్‌లో బరితెగించిన దుండగులు

యజమానిని కత్తితో బెదిరిస్తున్న దుండగులు

మేడ్చల్, జూన్ 20: మేడ్చల్‌లో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఏకంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని బంగారం దుకాణంలోనే చోరీకి పాల్పడ్డారు. దుకాణదారుడిపై కత్తితో దాడి చేశారు. కొంత నగలు, నగదు దోచుకున్నారు. యజమాని సమయస్ఫూర్తి, ధైర్యం కారణంగా దొంగలు పరారయ్యారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మేడ్చల్ పట్టణంలో పోలీస్‌స్టేషన్ గేట్‌కు రెండు మూడు దుకాణాల ఆవల జగదాంబ జ్యువెల్లరి దుకాణం ఉన్నది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతానికి గురువారం మధ్యాహ్నం ఒకటిన్నర ప్రాంతంలో ఇద్దరు బైక్‌పై వచ్చారు. ఎత్తుగా ఉన్న వ్యక్తి బురఖా వేసుకోగా, మరోవ్యక్తి హెల్మెట్ పెట్టుకుని ఉన్నాడు. ఆ ఇద్దరు నేరుగా నగల దుకాణంలోకి దూరారు. బురఖా వేసుకున్న వ్యక్తి కత్తితో బెదిరిస్తూ యజమాని శేషారాంను బంగారం, వెండి నగలు ఇవ్వాలని హెచ్చరించాడు. యజమాని హతాశుడై చూస్తుండగానే కుడివైపు ఛాతిపై పొడిచాడు. ఒక్కసారి భయాందోళనకు గురైన షాపులోనే ఉన్న ఆయన కొడుకు సురేశ్ లోపలికి వెళ్లాడు. దొంగలు తమ వెంట తెచ్చుకున్న బ్యాగులో నగలు వేయాలంటూ బెదిరిస్తుంటే.. మీరే తీసుకోండి అంటూ శేషారాం చేతులెత్తేశాడు. హెల్మెట్ పెట్టుకున్న వ్యక్తి కౌంటర్ లోపల ప్రదర్శనకు ఉంచిన నగలను బ్యాగులో వేసే ప్రయత్నం చేస్తుండగా, శేషారాం వారిని తప్పించుకొని బయటికొచ్చి చోర్ చోర్ అంటూ అరిచాడు. అతడిని అనుసరించిన దొంగలు భయపడి బైక్ స్టార్ట్ చేసుకొని పారిపోయారు. ఇదే సమయంలో శేషారాం కుమారుడు సురేశ్ కుర్చీని బైక్ వెనుకాల కూర్చున్న వ్యక్తిపై విసిరాడు. కుర్చీ అతడికి తగిలినా కింద పడకపోవడంతో పారిపోయారు. పక్కనే ఉన్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన శేషారాంను దవాఖానకు తరలించారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నది.

సంచలనమైన ఘటన

పట్టపగలే నగల దుకాణాదారుడిపై కత్తితో దాడిచేసి, దొంగతనానికి యత్నించిన ఘటన సంచలనంగా మారింది. దాడి సీసీ పుటేజీ బయటికి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా హల్‌చల్ అయింది. ఘటన జరిగిన కొద్ది సమయంలోనే పట్టణ వ్యాప్తంగా ఉన్న నగలు వ్యాపారాలు, పట్టణ ప్రజలు జగదాంబా జ్యూవెల్లరీ దుకాణం వద్ద పెద్ద ఎత్తున గుమిగూడారు. ఘటనా స్థలాన్ని డీసీపీ నితిక పంత్, అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, సీఐ సత్యనారాయణ సందర్శించారు. దొంగలు హిందీ మాట్లాడిన కారణంగా ఉత్తర భారతదేశానికి చెందినవారిగా భావిస్తున్నట్టు తెలిపారు. దొంగల దాడిలో గాయపడినప్పటికీ దుకాణ యజమాని చూపిన తెగువను మెచ్చుకున్నారు.

వివస్త్రను చేసి.. మర్మాంగంలో కారం పూసి!

చెంచు మహిళపై ముగ్గురు దుండగుల పైశాచిక దాడి

- పది రోజులుగా ఒకే గదిలో నిర్బంధించి చిత్రహింసలు
- నాగర్‌కర్నూల్ జిల్లా మొలచింతలపల్లిలో దారుణం
- అమానవీయ దాడి ఘటనపై మంత్రి జూపల్లి సీరియస్

పెంట్లవెల్లి, జూన్ 20: చెంచు మహిళను ఇంట్లో నిర్బంధించి ముగ్గురు దుర్మార్గులు పదిరోజులుగా చిత్రహింసలు పెట్టారు. మహిళ శరీరంపై వాతలుపెట్టి.. పచ్చి మిరపకాయలు నూరి శరీరం, కండ్లు, మర్మంగాల్లో చల్లారు. నిప్పటించేందుకు డీజిల్‌ను కూడా ఒంటిపై పోశారు. సభ్యసమాజం తలదించుకొనే అమానవీయ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో బుధవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చెంచు మహిళపై జరిగిన అమానవీయ ఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. పాశవిక దాడిని ఖండించి, విచారం వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. మొలచింతలపల్లిలోని చెంచు భ్రమరాంబ కాలనీలో ఓ ఆదివాసీ దంపతులు నివసిస్తున్నారు. వారు తమకున్న మూడెకరాలను అదే గ్రామానికి చెందిన బండి వెంకటేశ్, సలేశ్వరం, బండి శివుడు (ముగ్గురు బీసీ సామాజిక వర్గం)కు కౌలుకు ఇచ్చారు. కౌలుకు తీసుకున్న వారు ముందే డబ్బులు చెల్లించి ఆదివాసీతో అదే పొలంలో కొన్నేండ్లుగా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. పది రోజుల కిందట భార్యాభర్తల మధ్య గొడవ జరగగా.. పొలంలో పనిచేయడం ఇష్టం లేక ఊరు విడిచి వెళ్లింది. తన భార్య కనిపించడంలేదంటూ భర్త ఆరాతీశాడు. భార్యకు తల్లిదండ్రులెవరూ లేకపోవడంతో ఊరూరూ తిరుగుతూ చివరికి చుక్కాయపల్లికి చేరుకున్నది. చుక్కాయపల్లిలో వెంకటేశ్ బంధువులు ఆమెను చూసి వారికి సమాచారమిచ్చారు. వెంకటేశ్, సలేశ్వరం, బండి శివుడు కలిసి ఆమెను చుక్కాయపల్లి నుంచి మొలచింతపల్లికి తీసుకొని వస్తూ.. దారి మధ్యలో చితకబాదారు. మొలచింతపల్లిలో బండి వెంకటేశ్ ఇంట్లో నిర్బంధించి వివస్త్రగా మార్చారు. పచ్చి మిరపకాయలను నూరి శరీరం, కండ్లు, మర్మంగాల్లో చల్లారు. నిప్పటించేందుకు డీజిల్‌ను ఒంటిపై పోశారు. ఆచూకీ తెలియని ఆమె భర్త గ్రామాల్లో వెదకసాగాడు. మహిళను ఇంట్లో నిర్బంధించిన విషయం బయటకు పొక్కడంతో గ్రామంలోని కొందరు మహిళలు నేషనల్ లేబర్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చేరుకొని నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం 108లో కొల్లాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించినట్లు వైద్యులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు కొల్లాపూర్ ఎస్సై హృషికేష్ తెలిపారు. ఆదివాసీ సంఘం సభ్యుడు వెంకటస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

పాశవిక దాడులను ఉపేక్షించబోం

- మంత్రి జూపల్లి

చెంచు మహిళపై జరిగిన అమానవీయ ఘటనపై ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పందించారు. పాశవిక దాడిని ఖండించి, విచారం వ్యక్తం చేశారు. బాధిత మహిళకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఇలాంటి పాశవిక దాడులకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్‌కు ఫోన్ చేశారు. కేసు దర్యాప్తు పురోగతిపై మంత్రి ఆరా తీశారు.

24 గంటల్లో ఐదు హత్యలు!

మొదటిపేజీ తరువాయి...

నడిరోడ్డుపై నాలుగు హత్యలు చోటుచేసుకోవడం మరోసారి నగరాన్ని భయం నీడలోకి తీసుకువెళ్లింది. ఇందులో ఆసిఫ్‌నగర్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి ఒక హత్య జరుగగా... ఈ పరిధిలోనే నాలుగు రోజుల కిందట మరో హత్య జరగడం... పైగా ఈ రెండు హత్యలు కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జరుగడం గమనార్హం.

24 గంటల వ్యవధిలో జరిగిన హత్యలివి

- శాలిబండ ఠాణా పరిధిలో రౌడీషీటర్ల వార్ జరిగింది. కాలపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్‌గా ఉన్న అసద్(30), కాలపత్తర్‌కు చెందిన అన్వర్ (40), అదే ప్రాంతంలో బేకరీలో పనిచేసే వాజిద్‌ను మంగళవారం అర్ధరాత్రి తాడ్‌బన్ ఫాతిమా దవాఖాన వద్దకు పిలిపించాడు. ఈ విషయం తెలుసుకొని అతని సోదరులు సాజిద్, నిమ్రా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకుడు రఫీఖ్ షిమ్లాన్(40), ఖదీర్ అక్కడకు చేరుకున్నారు. అక్కడ రెండు గ్రూపులు కత్తులతో దాడులు చేసుకోగా, ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. దవాఖానకు తరలిస్తుండగా రఫీఖ్ మృతి చెందాడు.
- దొంగసొత్తు పంపకాలలో తలెత్తిన వివాదం సనత్‌నగర్ ఠాణా పరిధిలో హత్యకు దారి తీసింది. ఏజీకాలనీ